సాక్షి
కాకినాడ

గురువారం । 4 । మే । 2023



వాహన సేవ రద్దు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించాల్సిన పొన్నచెట్టు వాహనం మీద ఊరేగింపు కార్యక్రమాన్ని వర్షం కారణంగా రద్దు చేశారు.



పేద విద్యార్థులకు 'పీఎం యశస్వి'

పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం యశస్వి'పథకాన్ని ప్రవేశ పెట్టింది.

8లో

రత్నగిరిపై వేదఘోష



రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధి బుధవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా జరిగింది.

8లో

న్యూస్‌రీల్

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య రెండవ జాబితా విడుదల

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రైవేట్,అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2023–24 ఏడాదికి 1వ తరగతి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల రెండవ జాబితా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ అన్నపూర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 9వ తేదిలోగా సంబంధిత పాఠశాలలో చేరాలన్నారు. లేనిపక్షంలో ఉచిత అడ్మిషన్ రద్దు చేస్తారన్నారు. సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలని ఆమె సూచించారు.

బోటు ఇంజిన్ నిర్వహణపై శిక్షణ

కాకినాడ సిటీ: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం(పీఎంఎంఎస్‌వై) కింద కాకినాడ ఎస్ఎఫ్‌టీబోటు ఇంజిన్ నిర్వహణ, ఫిషింగ్ ప్రాక్టీస్‌పై మూడు రోజులు పాటు నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ బుధవారం ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో సీఐఎఫ్ఎన్ఈటీ(విశాఖపట్నం యూనిట్) ఆధ్వర్యంలో దీనిని నిర్వహించింది. పీఎంఎంఎస్‌వై ద్వారా మత్స్యకారులకు అందిస్తున్న సంక్షేమం వివరాలను తెలియజేశారు.శిక్షణలో 40 మంది పాల్గొన్నారు. బోటు ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతుపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. దీనిపై సమాచారమున్న పుస్తకాలను కూడా మత్స్యకారులకు అందజేశారు. మత్స్యశాఖ జిల్లా జేడీ పీవీ సత్యనారాయణ, మత్స్యశాఖ అధికారులు వి. పెద్దిబాబు, ఎస్‌బి రంగారి, టి.సుమలత, టి. హరినాథ్‌రావు, గంగార్జున పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రత్యేక బస్సు



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ప్రజారవాణా అధికారి శ్రీనివాసరావు

కాకినాడ: కాకినాడ నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర కోసం వేసిన ప్రత్యేక బస్సును కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. మధ్యాహ్నం 2 గంటలకు బస్సు ఇక్కడి నుంచి బయలుదేరింది. కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం ఈ ప్రత్యేక బస్సు అరుణాచలం వెళ్తుంది. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తి అయ్యాక తిరిగి కంచి, శ్రీకాళహస్తి దర్శనం అనంతరం కాకినాడ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక బస్సు ప్రతీ నెల 3వ తేదీన కాకినాడ నుంచి వెళ్తుందని, గిరి ప్రదక్షిణకు వెళ్ళాలనుకునే భక్తులు ముందుగా ఆర్టీసీ డిపోను సంద్రించి టిక్కెట్లు రిజర్వు చేసుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయుపీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, ఏఈ కె.ప్రభాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎవరెస్టు శిఖరం అధిరోహించిన శ్రీనివాస్



ఎవరెస్టు శిఖరంపై శ్రీనివాస్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పాల డైరీలో పని చేస్తున్న కానూరి శ్రీనివాస్ ఇటీవల ఎవరెస్టు బేస్ క్యాంపులో 5364 మీటర్ల ట్రెక్కింగ్ చేసి జాతీయ జెండా ఎగురవేశాడు. గతనెల 16న నేపాల్‌లో లుక్ల ప్రాంతం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభించాడు. వారం రోజులకు ఎవరెస్టు బేస్ క్యాంపునకు చేరుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎప్పటి నుంచో ఎవరెస్టు శిఖరం అధిరోహించాలన్న ఆకాంక్ష నెరవేరిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ఏపీ సీఎం కప్ సెమీస్‌లో తూర్పు జట్టు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): తిరుపతిలో జరుగుతున్న ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయని డిఎస్‌ఏ చీఫ్‌కోచ్ శ్రీనివాస్ కుమార్ బుధవారం తెలిపారు. బాస్కెట్‌బాల్ కోచ్ రుద్ర ఆధ్వర్యంలో తర్ఫీదు పొందిన జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రతిభ చూపిందన్నారు.

మెట్ట టీడీపీలో సిగపట్లు





చంద్రబాబును కలిసేందుకు ర్యాలీగా బయలుదేరిన పిఠాపురం టీడీపీ అసమ్మతి వర్గ నాయకులు(ఫైల్)

- పిఠాపురం 'దేశం'లో అంతర్యుద్ధం
- వర్మపై కత్తులు దూస్తున్న నేతలు
- టీడీపీ సీనియర్లలో ఆగ్రహ జ్వాల
- ప్రత్తిపాడుపైనా చూపుతున్న ప్రభావం

సాక్షిప్రతినిధి,కాకినాడ: తెలుగుదేశంపార్టీలో నేతల మధ్య అంతర్యుద్ధం తారా స్థాయిలో నడుస్తోంది. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా ఆ పార్టీ నేతలు సీట్ల కోసం కత్తులు దూసుకుంటున్నారు. ఆవిర్భావం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భిన్న ధ్రువాలుగా ఉన్న ఇద్దరు మెట్ట ప్రాంత నేతల మధ్య ఇటీవల పరిణామాలు భగ్గుమంటున్నాయి. జనసేనతో టీడీపీకి పొత్తు ఉంటుందా లేదా అనే దానిపై స్పష్టత లేదు. ఒకవేళ పొత్తు ఉంటే జిల్లాలో టీడీపీ వదులుకోవాల్సిన సీట్లలో పిఠాపురం ముందు వరుసలో ఉంటుందనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ వర్మ ఆ సీటును వదులుకునే ప్రసక్తే లేదని చెబుతున్నారు. అదే రీతిలో పావులు కూడా కదుపుతున్నారు.

ఇప్పటికే అల్టిమేటం

ఉమ్మడి తూర్పుగోదావరిలోనే అత్యధిక కాపు సామాజికవర్గం ఉన్న నియోజకవర్గం పిఠాపురం. ఈ సీటు జనసేన ఒప్పందంతో సంబంధం లేకుండా అదే సామాజికవర్గానికి ఇవ్వాలనేది జిల్లా పార్టీలో సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు. గత ఎన్నికల అనంతరం వర్మ పెత్తందారీ విధానాలతో విసుగెత్తిపోయిన ద్వితీయ శ్రేణి నేతలు ఇటీవల ఈ రాగాన్ని బలంగా వినిపిస్తున్నారు. టీడీపీకి అసలు ఖర్మ వర్మతోనే అంటూ ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి నేతలు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. వర్మకే మరోసారి అధిష్టానం అవకాశం ఇస్తేగిస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని వీరంతా అల్టిమేటం కూడా ఇచ్చారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు బవిరిశెట్టి రాంబాబు, తెలుగు రైతు అధ్యక్షుడు జ్యోతుల సతీష్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు మాదేపల్లి శ్రీను, దుడ్డు నాగు, కుంపట్ల సత్యనారాయణ తదితరులు ఇటీవల వర్మ తీరును ప్రత్యేకంగా మీడియా సమావేశం పెట్టి మరీ తూర్పారబట్టారు. తెలుగుదేశం ఏలుబడిలో వర్మ ఎమ్మెల్యేగా ఉండగా తమను విస్మరించి బంధువర్గానికే ప్రాధాన్యం ఇచ్చారని ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నేతలు రగిలిపోతున్నారు.

ప్రత్తిపాడుపై ఫోకస్ ..

ప్రత్తిపాడు తమకు కేటాయించాలని బీసీలు స్వరం విపిస్తున్నారు. ఇందుకు అక్కడున్న బీసీ సామాజికవర్గాల సంఖ్యాబలాన్ని చూపిస్తున్నారు. అందుకే చాలా కాలంగా యనమల కృష్ణుడు కన్ను ప్రత్తిపాడుపై పడిందని చెబుతున్నారు. వరుస పరాజయాలు మూటగట్టుకున్న ఈయన్ను తుని తెరమీద నుంచి చంద్రబాబు తప్పించి రామకృష్ణుడు కుమార్తెకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అటు తుని, ఇటు ప్రత్తిపాడుల నుంచి కృష్ణుడిని చంద్రబాబు పరిగణనలోకి తీసుకోకపోవడంతో వర్మ పంథా మార్చుకుని ప్రత్తిపాడుపై దృష్టి పెట్టడం వర్గ విబేధాలకు మరింత ఆజ్యం పోసింది. సత్యప్రభకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాక కూడా వర్మ అక్కడ తన సామాజికవర్గానికి చెందిన మురళీరాజును పనిగట్టుకుని పార్టీలో చేర్పించారంటున్నారు. ఈ చేరిక విషయం పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు మాట మాత్రమైనా చెప్పకపోవడంతో ఆ వర్గం వర్మపై అగ్గిమీద గుగ్గిలమవుతోంది. పొత్తులో భాగంగా పిఠాపురం సీటు దక్కకుంటే ప్రత్తిపాడు తమ సామాజికవర్గానికి కేటాయించుకోవడం ద్వారా వర్మ ప్రయత్నాలకు చెక్ పెడతామని జ్యోతుల వర్గం బాహాటంగానే చెబుతోంది. ఈ వ్యవహారం చినికిచినికి గాలివానగా మారి ఎటుదారి తీస్తుందోనని టీడీపీలో చర్చనీయాంశంగా మారింది.

సీనియర్ల ఆగ్రహం

పిఠాపురం వ్యవహారాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తెరవెనుక ఉండి నడిపిస్తున్నారని వర్మ వర్గీయుల ఆరోపిస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని వర్మ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెహ్రూకు వ్యతిరేకంగా కూటమి కడుతున్నారనే చర్చ పార్టీలో జరుగుతోంది. ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న సీనియర్ నాయకుడు, పార్టీ గొల్లప్రోలు మండల అధ్యక్షుడు కాపు సామాజికవర్గానికి చెందిన బవిరిశెట్టి రాంబాబును కుంటిసాకులతో పార్టీ నుంచి సస్పెండ్ చేయించారని వర్మపై ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. ఈ సస్పెన్షన్‌ను నెహ్రూ తీవ్రంగా వ్యతిరేకించడంతో వీరిద్దరి మధ్య విబేధాలు పొడసూపాయి. ఈ నేపథ్యంతోనే నెహ్రూతో రాజకీయ వైరం కలిగిన యనమల రామకృష్ణుడుతో వర్మ జట్టు కట్టారంటున్నారు. తన సీటు కాపాడుకోలేని వర్మ ప్రత్తిపాడు సీటు కోసం ప్రయత్నిస్తున్నారని తెలిసి మెట్ట ప్రాంత టీడీపీ భగ్గుమంటోంది. వరుపుల రాజా మరణం తరువాత ఆయన సతీమణి సత్యప్రభకు అధిష్టానం నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది.

హైవేపై నిరంతర నిఘా

జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



గండేపల్లి పోలీస్ స్టేషన్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గండేపల్లి: కాకినాడ జిల్లా పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై నిరంతరం పోలీస్ నిఘా ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. సామాజిక తనిఖీల్లో భాగంగా అడ్మిన్ ఎస్పీ పి.శ్రీనివాస్‌తో కలిసి బుధవారం గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. తూర్పుగోనగుడెం నుంచి పాయకరావుపేట వరకూ హైవేపై హైటెక్ డిజిటల్ వీడియో కెమెరాల నిఘా ఉంటుందన్నారు. రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు డివైడర్ల వద్ద స్టాప్ బోర్డ్స్, వేగాన్ని నియంత్రించేందుకు ప్లాస్టిక్ డ్రమ్ములు, టైర్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలోని అసత్య ప్రచారాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇటువంటి ప్రచారాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా విక్రయాలు, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి నివారణకు జిల్లా పోలీస్ యంత్రాంగం అంకితభావంతో పని చేస్తోందన్నారు. గంజాయి రవాణా మార్గాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కోటనందూరు బస్టాండ్‌లో మహిళపై అత్యాచార జరిగినట్టు వచ్చిన వార్తల్లో ఎంతమాత్రం నిజంలేదని ఆయన తెలిపారు. మండల పరిధిలో గల ప్రైవేటు కళాశాలల విద్యార్థులు గంజాయికి అలవాటు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడిన కేసులను చేదించిన సీఐ, ఎస్సైలను ఆయన అభినందించారు. జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై.గణేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపకూ గోదారి

- రాజానగరం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రూ. 215 కోట్ల వ్యయంతో పథకం రూపకల్పన
- తాజాగా లభించిన పరిపాలనానుమతులు
- ఎన్నికల హామీ నెరవేర్చుతున్న ఎమ్మెల్యే రాజా



ముక్కినాడలో నిర్మిస్తున్న ఓహెచ్ఆర్ (ఫైల్)

రాజానగరం: రాజానగరం నియోజకవర్గంలో దాహార్తి తీర్చేందుకు ఇంటింటికీ కుళాయిల ద్వారా గోదావరి జలాలను అందిస్తానంటూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇచ్చిన హామీ నెరవేరనుంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ పాలనానుమతులను మంజూరు చేయడంతో మార్గం సుగమమైంది. గోదావరి సమీపాన ఉన్నా ఈ నియోజకవర్గంలో తాగునీటికి భూగర్భ జలాలే ఆధారం. సీతానగరం మండలం చాలావరకు ఏటిపట్టున ఉన్నా, కోరుకొండ, రాజానగరం మండలాలు పూర్తిగా మెట్ట ప్రాంతంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో తనను గెలిపిస్తే, నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా గోదావరి జలాలను అందిస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలిచిన జక్కంపూడి రాజా హామీ ఇచ్చారు. గత నాయకుల మాదిరిగా హామీలను విస్మరించకుండా పట్టువదలని విక్రమార్కునిగా అడుగులు వేశారు. నాడు తండ్రి రామ్మోహనరావు తరహాలోనే ఇచ్చిన మాటకు కట్టుబడి నీటిని అందించనున్నారు.

రూ. 215 కోట్ల వ్యయం

నియోజకవర్గానికి గోదావరి జలాలను అందించే బృహత్ ప్రణాళికను జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.215 కోట్లతో చేపట్టేందుకు ఈనెల 1న పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ పథకం ద్వారా రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలలోని 93 నివాసిత ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా శుద్ధిచేసిన గోదావరి జలాలను అందిస్తారు. ఇందుకు సంబంధించిన పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ఓహెచ్ఆర్‌లను నిర్మిస్తున్నారు.

పురుషోత్తపట్నం వద్ద ప్రధాన లిఫ్టు

సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద ప్రధాన లిఫ్టు నుంచి గోదావరిలోని నీటిని మోటార్ల సాయంతో తోడి, అక్కడనే శుద్ధి చేస్తారు. 3.5 లక్షల సామర్థ్యంతో కూడిన సంప్‌లో నీటిని నిల్వ చేస్తారు. అక్కడే వంద అడుగుల ఎత్తులో నిర్మించిన 7 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి సంప్ నీటిని పంపిస్తారు. మోటార్ల ద్వారా నీటిని సీతానగరం మండలంలోని 32 గ్రామాలకు 83 కి.మీ. వరకు వేసే పైపులైన్ల ద్వారా ఓహెచ్ఆర్‌లకు పంప్ చేస్తారు. అక్కడ నుంచి కుళాయిల ద్వారా ఇంటింటికీ నీటి సరఫరా జరుగుతుంది.

- కోరుకొండ మండలంలోని 22 గ్రామాలకు కోరుకొండలో 1.30లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసిన సంప్‌నకు పురుషోత్తపట్నం లిఫ్టు నుంచి నీటిని పంప్ చేస్తారు. అక్కడ నుంచి ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి పంపిస్తారు. మండలంలో 82 కి.మీ. మేర నీటిని సరఫరా చేస్తారు.
- పురుషోత్తపట్నం ప్రధాన లిఫ్టు నుంచి గోదావరి జలాలు రాజానగరం మండలం చక్రద్వారబంధం, రాధేయపాలెం వద్ద రెండు సంప్‌లకు వస్తాయి. అక్కడ నుంచిచక్రద్వారబంధంలో 1.5 లక్షల లీటర్లు, రాదేయపాలెంలో 1.4 లక్షల లీటర్లు సామర్థ్యంతో నిర్మించిన సంప్‌లకు ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి పంపిస్తారు. అక్కడ నుంచి మండలంలోని 39 గ్రామాలకు గోదావరి జలాలను సరఫరా చేస్తారు.



సంపత్‌నగరంలో నిర్మించిన ఓహెచ్ఆర్

తిరుపతిలో పెంటాథలాన్ రాష్ట్రస్థాయి పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): తిరుపతిలో ఈనెల 8,9 తేదీలో మోడరన్ పెంటాథలాన్ లేజర్ రన్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. అండర్-9, 11, 13, 15, 17, 19, 21 వయస్సుల వారికి జూనియర్స్ విభాగంలోను, 22 నుంచి 39 సంవత్సరాల వారికి సీనియర్స్ విభాగంలోను, 40 నుంచి 50 సంవత్సరాల వారికి మాస్టర్స్ విభాగంలో, దివ్యంగులకు ప్రత్యేక విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 5 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారు జాతీయస్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు 9848411027 నెంబరులో సంప్రదించాలని కోరారు.

7 నుంచి క్రికెట్ వేసవి శిబిరం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సత్యన్నారాయణ బుధవారం తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ క్రీడామైదానంలో ఉదయం 8 నుంచి 10 వరకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు ఎంపికలకు హాజరుకావాలని ఆయన కోరారు.

రైతు గుండెల్లో వాన గుబులు



తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే ప్రయత్నం

- మూడు రోజులుగా వీడని వర్షం
- వరి చేతికందే సమయంలో విపత్తు
- ఆందోళన చెందుతున్న జిల్లా రైతులు

కాకినాడ సిటీ: ఈ ఏడాది రబీ సీజన్ చివరిలో వరుణుడు ఇబ్బంది పెట్టాడు. వీడని వానలతో రైతు ఆందోళన చెందుతున్నాడు. ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులు రబీలో గట్టెక్కగలమని భావించారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలకు నిండా మునుగుతున్నామని ఆవేదన చెందుతున్నారు. నాలుగు నెలల పాటు కష్టపడి సాగు చేసిన పంటలపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈసారి వేసవికాలంలో రెట్టింపు వర్షాలు కురుస్తున్నాయి. మళ్లీ బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావంతో వాతావరణం ప్రతికూలంగా మారడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 62,500 ఎకరాలలో వరి పంట వేయగా ఇప్పటికే 60 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. కోతలు పూర్తయి అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన ధాన్యం వర్షాలకు తడిసి దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు. కూలీలను వినియోగించినా కోత కోసి ధాన్యం పట్టే సరికి ఎకరానికి రూ. 12 వేలు ఖర్చుఅవుతోంది. ఈ రీతిలో ప్రకృతి వైపరీత్యాలు విరుచుకుపడడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుందంటున్నారు.

నేలవాలిన పంట

జిల్లాలో వరి అధికంగా సాగు చేశారు. కొంత మంది ఖర్చు తక్కువ...దిగుబడి ఎక్కువ ఉంటుందనే ఆశతో బొండాలు రకం ధాన్యాన్ని పెద్ద ఎత్తున ఊడ్చారు. గతంతో పోలిస్తే వరి సాగు విస్తీర్ణం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కొన్ని ప్రాంతాల్లో చేతికందే దశలో ఉన్న వరి నేలకొరిగింది. కోత కోసిన ధాన్యం రోడ్లపై రాశులుగా పోసి ఉంచారు. వర్షాలకు తడిసిపోవడంతో మొలకలొచ్చే పరిస్థితి ఉందని, ధాన్యం రంగు మారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో పంటలు ఆరబెట్టే పరిస్థితి కనిపించడంలేదు. ఆశించిన దానికన్నా దిగుబడి వస్తుందని భావిస్తున్నా దానిని సురక్షితంగా కాపాడుకునే మార్గం లేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవడంతో తలను వాయిదానే వేసుకోవాలని, కోసిన పంటను వీలైనంత వరకు కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పాలని, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా వ్యవహరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే కోసిన వరి పంటను పొలాల పక్కనే రోడ్లపైన, ఖాళీస్థలాల్లోను రాశులుగా పోసి బరకాలతో కప్పి ఉంచారు.

తాజాగా వర్షం ఇలా..

జిల్లాలో బుధవారం 9.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గండేపల్లి మండలంలో 30.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, తొండంగి మండలంలో అత్యల్పంగా 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పిఠాపురం, శంఖవరం, తాళ్లరేవు, తునిల్లో వర్షపాతం నమోదు కాలేదు. మండలాల వారీ నమోదైన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో ఇలా.. పెదపూడిలో 29.2, కాకినాడ అర్బన్‌లో 22.8, కరప 22.6, కాకినాడ రూరల్ 18.2, ఏలేశ్వరం 15.6, సామర్లకోట 8.4, పెద్దాపురం 7.6, కిర్లంపూడి 6.4, కాజులూరు 6.2, రౌతులపూడి 5.2, యు కొత్తపల్లి 5.2, జగ్గంపేట 4.6, గొల్లప్రోలు 4.2, ప్రత్తిపాడు 2.8, తొండంగి 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్ష బాధిత రైతులను ఆదుకుంటాం

జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్ విజయకుమార్




జల్లూరులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్ విజయకుమార్

పిఠాపురం వర్షాలకు ధాన్యం రాశులు, వరి పనలు దెబ్బతిన్న రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్ విజయకుమార్ తెలిపారు. ఆయన బుధవారం పిఠాపురం మండలం జల్లూరు, మల్లాం, తదితర గ్రామాల్లో ధాన్యం రాశులను, కోత కోసిన వరి పంటలను పరిశీలించారు. వరి పనలు దెబ్బతినకుండా ధాన్యం రంగు మారకుండా, మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఉప్పు ద్రావణం పిచికారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు చేసి చూపించారు. మొలకలు వచ్చిన, రంగు మారిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా పెట్టుబడి రాయితీ, క్రాప్ ఇన్సూరెన్సు సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈయన వెంట పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీఏ స్వాతి, రైతుబరోసా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'పీఎం యశస్వి'

- కేంద్ర ప్రభుత్వ వినూత్న ఉపకార వేతన పథకం
- ఆగస్టు 26 వరకు దరఖాస్తుకు అవకాశం





పీఎం యశస్వి లోగో

రాయవరం: పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం యశస్వి'పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఆర్థికంగా వెనుకబాటుతనం ఉన్నవారి కలలను ఈ పథకం ద్వారా నెరవేర్చుకునే వీలుంది. ప్రతిభ ఉండి నిస్సహాయ పరిస్థితుల్లో చదువును మధ్యలో ఆపేసి ఉపాధి బాట పట్టే వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి 'పీఎం యశస్వి' పేరుతో గతేడాది రూపకల్పన చేసింది. యశస్వి అంటే 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా'. ఇప్పటి వరకు ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో 'పీఎం యశస్వి' కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పథకానికి ఆధ్వర్యం వహిస్తోంది.

అర్హులు ఎవరంటే..

- కేంద్ర విద్యాశాఖ అధికారి ఎన్‌టీ ఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9,10 తరగతులు పూర్తయిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మిగిలిన సంవత్సరాలకు (ఇంటర్ వరకు) మాత్రమే స్కాలర్ షిప్ లభిస్తుంది.
- ఓబీసీ, ఈబీసీ తరగతులకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. – 9వ తరగతిలో దరఖాస్తు చేసుకునే వారు 2004 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2008 మార్చి 31లోపు జన్మించి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించి ఉండరాదు.

గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు.

దరఖాస్తు ఇలా..

ప్రవేశ పరీక్ష రాయడానికి ఎన్‌టీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. పేరు, ఈ–మెయిల్ అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారునికి అప్లికేషన్ నంబరు వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ కావాలి. అంతటితో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

పరీక్ష నిర్వహిస్తారిలా

మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు కొనసాగే పరీక్షలను హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తారు. ప్రవేశ రుసుం లేదు. 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 120 మార్కులకు 30 ప్రశ్నలు, సైన్సులో 80 మార్కులకు 20 ప్రశ్నలు, సోషల్‌లో 100 మార్కులకు 25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు మరో 25 ప్రశ్నలుంటాయి. దేశవ్యాప్తంగా 78 ప్రధాన నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. గతేడాది సెప్టెంబరు 11న ఈ పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 26తో దరఖాస్తు ప్రక్రియ పూర్తికానుంది.

ఉపకార వేతనం ఎంత?

9, 10 తరగతులకు ఏటా రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ లేదా 11,12 తరగతులకు ఏటా రూ.1.25 లక్షలు ఉపకార వేతనం ఒకేసారి అందిస్తారు.

అర్హత సాధించిన తర్వాత

విద్యార్థులు మళ్లీ ఉపకార వేతనం కోసం అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటారో ఆ బ్యాంకు పాస్ పుస్తకం ఫొటో కాపీని జత చేయాలి. ఉపకార వేతనం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటితో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలో అయినా విద్యార్థులు విద్యనభ్యసించవచ్చు.

క్లుప్తంగా

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి శ్రీమార్కండేయ నాటక కళా పరిషత్ ఆద్వర్యంలో 16వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. స్థానిక అపర్ణా కళా తోరణం శ్రీబత్తుల మురళీ కృష్ణ కళావేదికపై గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాటక రంగంలో గుర్తింపు పొందిన కళాకారులు పాల్గొన్నారు . కొత్త పరిమళం, రైతే రాజు, చీకటి పువ్వు, నాన్నా నేనొచ్చేస్తా, వెండి అంచులు, గమ్యస్థానాల వైపు, కాపలా తదితర నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. బుధవారం ముగింపు సమావేశం నిర్వహించి నటులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో న్యాయనిర్ణేతలు రాజా తాతయ్య, చల్లా సత్యనారాయణ, లొల్ల సత్యనారాయణ, పడాల రవి, జక్కా సాంబశివరావు, దాసం కామరాజు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 98 (ఎంటీఎస్) డీఎస్సీ ఉపాధ్యాయుల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక బుధవారం స్థానిక ఎస్‌టీయూ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా చొల్లంగి కేశవకుమార్, కార్యదర్శిగా కోటిపల్లి రాంబాబు, కోశాధికారిగా పెంకే సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మొదటి సమావేశం ఏర్పాటు చేసి ముందుగా తమకు ఉద్యోగ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేసి ప్రతి ఒక్కరూ ఆయన వెన్నంటి ఉండాలని తీర్మానించారు. ఇటీవల ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు అందరూ దాదాపు 50 సంవత్సరాలు పైబడిన వారని, సమీప మండలంలో వారిని నియమించాలని కోరుతూ డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

రూ.10 లక్షల కోట్ల వ్యాపారం అధిగమించాం

- ఇండియన్ బ్యాంక్ దివాన్ చెరువు 65వ శాఖ ప్రారంభం
- ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్


దివాన్ చెరువు శాఖను ప్రారంభిస్తున్న జీఎం గణేష్ రామన్

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ రూ.10 లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించిందని ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్ పేర్కొన్నారు. బుధవారం ఇండియన్ బ్యాంక్ 56వ శాఖగా లాలాచెరువులో ఏర్పాటు చేసిన దివాన్ చెరువు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు కోరుకున్న కొత్త పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రధానంగా స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందజేస్తున్నామన్నారు. జోనల్ మేనేజర్ సుధాకర రావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జోన్ పరిధిలో పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఐదు జిల్లాల్లో 65వ శాఖగా లాలాచెరువు బ్రాంచి ప్రారంభోత్సవం జరిగిందన్నారు. జోన్ మొత్తం మీద రూ.7,819 కోట్ల వ్యాపారం సాగిస్తున్నామన్నారు. ఎస్‌హెజీసీ గ్రూపులకు రూ.250 కోట్లు రుణాలు అందజేశామన్నారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలకు రూ.135 కోట్లు, వ్యవసాయరంగానికి రూ.616 కోట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎం దుర్గా వరాహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రాంబాబు మృతదేహం

పి.గన్నవరం: మండలంలోని ముంగండ గ్రామంలో బుధవారం కూలి పనులు చేస్తున్న ఒక యువకుడు విద్యుధాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంగండ గ్రామానికి చెందిన బీర రాంబాబు (25) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను బంధువుల ఇంటి వద్ద పని చేస్తున్నాడు. అప్పటికే వాటర్ మోటారుకు ఉన్న విద్యుత్ వైరు తెగి కింద పడిపోయింది. ఆ వైరు రాంబాబు చేతికి తగలడంతో అతడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబుకు వివాహం కాలేదు. అతడి తండ్రి గతంలో చనిపోవడంతో తల్లి విజయను తానే పోషిస్తున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లి విజయ కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని కుటుంబాన్ని ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దేవస్థానం సూపరింటెండెంట్ నగేష్ ఇళ్లపై ఏసీబీ దాడులు


ద్వారకాతిరుమలలో నగేష్ అపార్ట్‌మెంట్


ద్వారకాతిరుమలలోని నగేష్ అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు


నిడదవోలులో సురేష్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు
- పలు విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం

ద్వారకాతిరుమల: స్థానిక వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నుంచి, విజయవాడ దుర్గ గుడికి 2022 జులై 1న బదిలీపై వెళ్లిన సూపరింటెండెంట్ వాసా నగేష్ ఇళ్లపై ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం దాడి చేశారు. పలు ప్రాంతాల్లోని ఆయన బంధువుల ఇళ్లపై సైతం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. నగేష్ ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టాడన్న సమాచారంతో ఏసీబీ అధికారులు ఏలూరు జిల్లా భీమడోలులోని అతని బంధువుల ఇళ్లల్లో, ద్వారకాతిరుమలలో నగేష్‌కు చెందిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర అపార్ట్‌మెంట్, విజయవాడ భవానీపురంలో అద్దెకుంటున్న లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంతో విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. కాగా ద్వారకాతిరుమలలోని అపార్ట్‌మెంట్‌లో ఏలూరు ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ సీఐ, ఎస్సై, సిబ్బంది అపార్ట్‌మెంట్ విస్తీర్ణం ఎంత, విలువ ఎంత, దాన్ని ఎప్పుడు నిర్మించారు వంటి వివరాలను సేకరించారు. అనంతరం స్థానిక కెనరా, యూనియన్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల్లోని అకౌంట్లను, లాకర్లను తనిఖీ చేశారు.

నిడదవోలులోనూ తనిఖీలు

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో సూపరింటెండెంట్ వాసా నగేష్ సోదరుడు, దస్తావేజుల లేఖరి వాసా సురేష్ ఇంట్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు దస్తావేజులు, భూములకు సంబంధించి పలు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే సమయంలో వాసా సురేష్ ఆస్తులకు సంబంధించిన పలు వివరాలను ఏసీబీ అధికారులకు చెప్పారు. రాజమహేంద్రవరం ఏసీబీ సీఐ సతీష్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏసీబీ సీఐ సతీష్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ వాసా నగేష్‌కు సంబంధించిన పలు ఆస్తులు, దస్తావేజులను పరిశీలించామని, వాటి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.


వాసా నగేష్ (ఫైల్)

రత్నగిరిపై వేదఘోష


సదస్యంలో వేద మంత్రాలు పఠిస్తున్న పండితులు

అన్నవరం : రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధి బుధవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వేద, స్మార్త పండితులు స్వామివారి ముందు తమ వేద విద్వత్తును ప్రదర్శించారు. ఈ సందర్భంగా 150 మంది పండితులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు సత్కరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పెళ్లిపెద్దలు సీతారాములు వెంట రాగా నిత్య కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడి వేదిక మీద ప్రతిష్ఠించారు. అనంతరం స్వామి అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించి పూజలు చేసిన తరువాత పండిత సదస్యాన్ని ప్రారంభించారు. సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం పండితుల వేద మంత్రాలతో మార్మోగింది. పండితులు స్వామివారి ముందు నాలుగు వేదాలు పఠించారు. తరువాత దేవస్థానం వేదపండితులు సత్యదేవుడు, అమ్మవార్లకు వేదాశీస్సులందజేశారు.

పండిత సత్కారం

అనంతరం వేద పండితులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు ఘనంగా సత్కరించారు. తొలుత ప్రముఖ పండితులు మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, గుళ్లపల్లి శ్రీరామచంద్ర ఘనాపాఠీ, చిర్రావూరి శ్రీరామశర్మ, తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు కె.సోమయాజులను నగదు కానుక, స్వామివారి ప్రసాదం, మామిడిపండ్లతో సత్కరించారు. తరువాత మిగిలిన పండితులను సత్కరించారు. దేవస్థానం విశ్రాంత వేదపండితులు ముష్టి కామశాస్త్రి, విశ్రాంతి ప్రధానార్చకులు నాగాభట్ల సత్యనారాయణ, విశ్రాంత వ్రత పురోహిత సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, విశ్రాంత వ్రతపురోహితులను కూడా సత్కరించారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, అర్చకస్వాములు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, ముత్య వేంకట్రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



రాజమహేంద్రవరం రూరల్/రాజానగరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన 55 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిందని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 27వ తేదీన ఆటోనగర్ టయోటా షోరూమ్ సమీపంలో నేషనల్‌హైవేపై స్కూటీ నడుపుతున్న వ్యక్తి అతివేగంగా మహిళను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని మహిళ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్కూటీ నడుపుతున్న వ్యక్తి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతిచెందిన మహిళ వివరాలు ఎవరికైనా తెలిస్తే బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ సెల్ నంబర్ 94407 96533 కు తెలపాలని ఎస్సై కోరారు.